క్లుప్తంగా

పాలిసెట్ రిజిస్ట్రేషన్లు ప్రారంభం



పెందుర్తి: స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో పాలిసెట్–2025 పరీక్ష కోసం రిజిస్ట్రేషన్లు ప్రారంభమైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.చంద్రశేఖర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. పదో తరగతి పాసైన వారు, ఈ ఏడాది చదువుతున్న వారు పాలిసెట్‌కు అర్హులన్నారు. ఓసీ, బీసీ విద్యార్థులు రూ.400, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.100 ఫీజు చెల్లించాలన్నారు. వచ్చే నెల 15 వరకు విద్యార్థులు రిజిస్ట్రేషన్లు చేసుకోవచ్చని, పరీక్ష ఏప్రిల్ 30న నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి వితరణ



పరీక్ష సామగ్రి అందిస్తున్న కార్పొరేటర్ బల్ల శ్రీనివాసరావు

పెందుర్తి: సుజాతనగర్‌లోని సత్యసాయి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో 'సాయి దీవెన'కార్యక్రమంలో భాగంగా వేపగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు పరీక్ష సామాగ్రి సమకూర్చారు. బుధవారం పాఠశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో కార్పొరేటర్ బల్ల శ్రీనివాసరావు చేతుల మీదుగా 168 మందికి రైటింగ్ ప్యాడ్‌లు, పెన్నులు, పెన్సిళ్లు, ఎరేజర్లు, షార్ప్‌నర్లు అందించారు. స్థానిక నాయకులు పిన్నింటి పార్వతి, హెచ్‌ఎం మహేష్, ట్రస్ట్ ప్రతినిధులు ముక్క గోపి, చిరికి శ్రీనివాసరావు, సీహెచ్ రవిశంకర్, టి.సీతారామయ్య, కె.వైకుంఠరావు, కె.ఉమ, వి.సాయి పద్మిని, జి.భవాని, కె.హైమావతి, పి.ధర్మారావు, వి.గీత తదితరులు పాల్గొన్నారు.

ఏసీలో పాము పిల్లలు



ఏసీలో పాము పిల్లలను పట్టుకున్న కిరణ్

పెందుర్తి: వేసవి వచ్చింది..ఎండలు మండుతున్నాయి. ఏసీ దుమ్ము దులుపుదామనుకున్న ఓ వ్యక్తికి పాములు షాక్ ఇచ్చాయి. స్థానిక నేతాజీనగర్‌లో నివాసం ఉంటున్న సత్యనారాయణ ఇంట్లోని ఏసీని శుభ్రం చేసేందుకు బుధవారం ఉదయం సిద్ధమయ్యారు. ఏసీ తెరవగానే అందులో నాలుగు పాము పిల్లలను చూసి అవాక్కయ్యారు. వెంటనే నగరానికి చెందిన స్నేక్ క్యాచర్ కిరణ్‌కు సమాచారం అందించారు. కిరణ్ చాకచక్యంగా పాము పిల్లలను పట్టుకుని అటవీ ప్రాంతంలో విడిచిపెట్టాడు. ఇంట్లోని పడకగదిలో ఉన్న ఏసీలో పాము పిల్లలు ఉండడంతో సత్యనారాయణ కుటుంబ సభ్యులు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు.

రబీ పంటల నమోదు ప్రారంభం

పెందుర్తి: రాంపురం రైతు సేవా కేంద్రం పరిధిలో రబీ సీజన్‌లో వేసే పంట నమోదు ప్రక్రియను బుధవారం ప్రారంభించారు. అగ్రికల్చరల్ అసిస్టెంట్ జ్యోతి మాట్లాడుతూ పెసర, మినుములు, నువ్వులు, కూరగాయల పంటల సాగు వివరాలను నమోదు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి రైతు తమ పంట వివరాలను నమోదు చేయించుకోవాలని సూచించారు. జెడ్పీ మాజీ ఫ్లోర్ లీడర్ రెడ్డి నారాయణరావు, గ్రామపెద్దలు, రైతులు పాల్గొన్నారు.

సబ్బవరం డిగ్రీ కాలేజీకి ఏ గ్రేడ్

సబ్బవరం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి కళాశాల నిర్వాహణ, పరిపాలనా పరమైన అంశాలపై అధికారుల బృందం పరిశీలన పూర్తయింది. ఈ మేరకు బుధవారం పలు అంశాలపై చర్చించిన బృందం కళాశాలకు ఏ గ్రేడ్ మంజూరు చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సీతాలక్ష్మి తెలిపారు. ఇందుకు సహకరించిన అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ తనిఖీల్లో చోడవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుడు డాక్టర్ కె.మల్లిబాబు, నర్సీపట్నం డిగ్రీ కళాశాల అధ్యాపకుడు రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

గ్లకోమాపై అవగాహన ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న డాక్టర్ రవీంద్ర, ఆస్పత్రి సిబ్బంది

సింహాచలం: గ్లకోమా వ్యాధి నివారణకు ముందస్తు గుర్తింపు తప్పనిసరని శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి గ్లకోమా వైద్యనిపుణుడు డాక్టర్ రవీంద్ర తెలిపారు. శంకర్ ఫౌండేషన్‌లో ఈ నెల 9 నుంచి జరుగుతున్న గ్లకోమా వారోత్సవాల్లో భాగంగా బుధవారం ఆస్పత్రి నుంచి వేపగుంట జంక్షన్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రవీంద్ర మాట్లాడుతూ కంటి యొక్క నిశ్శబ్ద దొంగగా పిలువబడే గ్లకోమా కంటి వ్యాధుల సమూహాన్ని కలిగి ఉంటుందన్నారు. దృష్టి కోల్పోవడానికి దారితీస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ విధిగా కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆస్పత్రి డీజీఎం బంగార్రాజు పాల్గొన్నారు.

- నరవ ప్రభుత్వ, ఏపీఐఐసీ భూముల్లో యథేచ్ఛగా గ్రావెల్ తవ్వకాలు
- టీడీపీ, జనసేన నాయకులు కుమ్మక్కై మట్టి అమ్మకాల్లో కాసుల వేట
- నరవ ప్రాంతాన్ని గాలికి వదిలేసిన రెవెన్యూ, మైనింగ్ యంత్రాంగం
- అక్రమ గ్రావెల్ తవ్వకాలతో రూ.కోట్లు వెనకేసుకుంటున్న వైనం

'మన గ్రామానికి సమీపంలో ఇష్టానుసారంగా అనుమతి లేకుండా గ్రావెల్ తవ్వకాలు జరుగుతున్నాయి. దీన్ని మనం కచ్చితంగా అడ్డుకోవాలి. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి ఇలాంటి చర్యలను నియంత్రించాలి. లేకపోతే మన గ్రామానికి చెడ్డపేరు వస్తుంది'.. పెందుర్తి మండలం నరవలో ఇటీవల జనసేన పార్టీ ఆధ్వర్యంలో జరిగిన గ్రామ సభలో ఆ పార్టీ నాయకుల మాటలు. కానీ ఆయా అక్రమ తవ్వకాల్లో అదే పార్టీతో పాటు టీడీపీ నాయకులు 'కాసుల మూటలు'వెనకేసుకుంటున్నారు. వారే గ్రామ సభలు పెట్టి నీతులు చెప్పడం విడ్డూరంగా ఉందని గ్రామస్తులు గుసగుసలు పోతున్నారు.

అక్రమాల బాట.. వాటాల మూట!



ఇటీవల జనసేన ఆధ్వర్యంలో నరవలో గ్రావెల్ అక్రమ తవ్వకాలపై నిర్వహించిన గ్రామసభ





పెందుర్తి రెవెన్యూ మండలం నరవలోని ప్రభుత్వ భూముల్లో గ్రావెల్ అక్రమ తవ్వకాలు

పెందుర్తి: గ్రామ స్థాయిలో టీడీపీ, జనసేన నాయకులు నరవలో రేయింబవళ్లు అక్రమ గ్రావెల్ తవ్వకాలకు పాల్పడుతూ రూ.కోట్లు ఆర్జిస్తున్నారు. అందులో వాటాలను 'ముఖ్య'నేతకు అందిస్తున్నారన్న ఆరోపణలు స్థానికంగా వినిపిస్తున్నాయి. మరోవైపు కూటమి నేతల అక్రమ దందాను అడ్డుకోవడంలో రెవెన్యూ, మైనింగ్ అధికారులు దారుణంగా విఫలమవుతున్నారు. వందల ఎకరాల్లోని ప్రకృతి వనరులను కొల్లగొట్టినా వారి కంటికి కనిపించట్లేదు. నరవలోని గ్రావెల్ దొంగలంటే భయమో.. మరేదైనా కారణమో తెలీదు గానీ.. ఇటు వైపు కన్నెత్తి చూసేందుక్కూడా ఆయా శాఖల అధికారులు ఇష్టపడట్లేదు. ప్రభుత్వ అనుబంధ ఏపీఐఐసీ యంత్రాంగం తీరు కూడా ఇందుకు భిన్నంగా ఏమీ లేదు. సంస్థకు చెందిన భూముల్లో సైతం అక్రమ తవ్వకాలు జోరుగా సాగుతున్నా వారు పట్టనట్లే ఉంటున్నారు. వీటి వెనుక కూటమి ముఖ్య నేత అండదండలే కారణమన్న ఆరోపణలున్నాయి.

నిద్ర నటిస్తున్న యంత్రాంగం

నరవ సర్వే నెం.1తో పాటు సర్వే నెం.7(70 ఎకరాల ఏపీఐఐసీ భూమి), 29, 27/8లలోని ప్రభుత్వ, గయాలు వందల ఎకరాల భూముల్లో కూడా టీడీపీ–జనసేన నాయకులు అక్రమ తవ్వకాలు జరుపుతున్నారు. ఆయా భూముల్లో అయితే పట్టపగలే మట్టిని తరలించుకుపోతున్నారు. దీనిపై సమాచారం అందుకున్న రెవెన్యూ అధికారులు ఇటీవల కాలంలో ఒకటి రెండు కేసులు పెట్టారు. ఏపీఐఐసీ అధికారులు మాత్రం ఈ అక్రమ గ్రావెల్ తవ్వకాలపై ఒక్క ఫిర్యాదు చేసిన పాపాన పోలేదు. కళ్ల ముందే కొండలు, గుట్టలు కరిగి గోతులుగా మారుతున్నా.. అధికారులు నిద్రనటిస్తున్నారు.

రెచ్చిపోతున్న మట్టి దొంగలు

ఈ ప్రాంతంలో గతంలో అడపాదడపా గ్రావెల్ తవ్వకాలు జరిగేవి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక స్థానిక టీడీపీ, జనసేన నాయకులు జూలు విదిల్చారు. అటవీశాఖ, ఏపీఐఐసీ అధికారుల ఉదాసీనతను ఆసరా చేసుకుని, తొమ్మిది నెలలుగా అక్రమ తవ్వకాలు యథేచ్ఛగా సాగిస్తున్నారు. పగలూ రాత్రి తేడా లేకుండా ఏపీఐఐసీ, ప్రభుత్వ భూముల్లోకి చొరబడి ఇష్టానుసారం గ్రావెల్‌ను తవ్వుకుంటున్నారు. దాన్ని టిప్పర్లతో మరో ప్రాంతానికి తరలించి, నిల్వ చేసుకుని సమయం చూసి అమ్మకాలు సాగిస్తున్నారు. అధికారంలో ఉన్న ఇరు పార్టీల నాయకులు కలిసి 'నీకింత.. నాకింత'అన్న చందంగా గ్రావెల్ దందాకు పాల్పడి, రూ.కోట్లు ఆర్జిస్తున్నారు. ఇప్పటికైనా ఆయా శాఖల ఉన్నతాధికారులు స్పందించి, నరవలోని ప్రకృతి వనరుల దోపిడీకి అడ్డుకట్ట వేయాలని స్థానికులు కోరుతున్నారు.



పట్టపగలే గ్రావెల్ అక్రమ తవ్వకాలు

కచ్చితంగా అడ్డుకుంటాం



నరవ ప్రాంతంలో మట్టి తవ్వకాలపై మాకు ఫిర్యాదులు వస్తున్నాయి. విషయం ఉన్నతాధికారుల దృష్టిలో ఉంది. ఫిర్యాదులు వచ్చిన వెంటనే మా అధికారులు అక్కడికి వెళ్లి అడ్డుకుంటున్నారు. రానున్న రోజుల్లో కూడా కచ్చితంగా అక్రమ తవ్వకాలపై, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటాం.

– ఎం.ఆనంద్‌కుమార్, తహసీల్దార్, పెందుర్తి

సమాజంలో మహిళల పాత్ర విశిష్టం

- ఫార్మాసిటీలో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం



రోషిణిని సత్కరిస్తున్న వివిధ సంస్థల ప్రతినిధులు

పరవాడ: సమాజంలో మహిళ పాత్ర చాలా విశిష్టమైందని విశాఖ జాయింట్ డెవలప్‌మెంట్ కమిషనర్ రోషిణి అపరంజి కొఠారి అన్నారు. విశాఖ ఫార్మాసిటీ, రాంకీ ఫౌండేషన్ సంయుక్తంగా బుధవారం ఫార్మాసిటీ కమర్షియల్ హబ్‌లో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో పాల్గొని, ప్రసంగించారు. ఉద్యోగం చేస్తున్న గృహిణులపై మరింత పనిభారం ఉంటుందని, వీరికి భర్త, కుటుంబ సభ్యుల సహాయ సహకారాలు ఎంతో అవసరమన్నారు. కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ ఎం.సునీత మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా సమర్థవంతంగా బాధ్యతలు నిర్వహిస్తున్నారని తెలిపారు. ప్రతి మహిళ వృత్తి విరామ సమయానికి అవసరమైన డబ్బును పొదుపు చేసుకోవాలని సూచించారు. జిల్లా రవాణా శాఖ అధికారి కె.పద్మావతి మాట్లాడుతూ ప్రతి మహిళకు విద్య అవసరమని, మహిళ అంటే అందం, అమాయకత్వమే కాదని మహిళ అంటే ధైర్యమని పేర్కొన్నారు. రాంకీ ఫార్మాసిటీ ఎండీ పి.పి.లాల్‌కృష్ణ మాట్లాడుతూ గృహిణిని మించిన ప్రణాళికా శాస్త్రవేత్త ఎవరూ లేరన్నారు. కార్యక్రమంలో భాగంగా రోషిణిని శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. వివిధ రంగాల్లో ప్రతిభ కనబర్చిన మహిళలకు అవార్డులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో రాంకీ ఫౌండేషన్ హెడ్ శ్రీకాంత్, ఫార్మాసిటీ డీజీఎం గిరిధర్ భక్షి, రాంకీ ఫౌండేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

వేపగుంట ముత్యమాంబ పండగ నేడు

- వేలాది కొబ్బరి కాయలతో ఆలయ అలంకరణ





వేపగుంటలో కొలువుదీరిన ముత్యమాంబ, కొబ్బరికాయలతో అలంకరించిన ముత్యమాంబ ఆలయం

పెందుర్తి: వేపగుంట ప్రజల ఆరాధ్య దేవత ముత్యమాంబ అమ్మవారి వార్షిక పండగ గురువారం భారీ ఎత్తున నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఆలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. వేలాది కొబ్బరి కాయలతో ఆలయాన్ని అలంకరించారు. నాలుగు రోడ్ల కూడలిలో విద్యుత్ దీపాలు కాంతులీనుతున్నాయి. వేలాదిగా తరలి వచ్చే భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అమ్మవారికి గురువారం వేకువజామునే తొలిపూజ చేసి దర్శనాలు కల్పిస్తారు. పండగ సందర్భంగా భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని అమ్మవారి గర్భగుడి దర్శనం నిషేధించారు. ఉత్సవంలో భాగంగా సాయంత్రం అమ్మవారిని గ్రామ వీధుల్లో ఊరేగిస్తారు. అనంతరం అనుపోత్సవం జరుపుతారు. మొత్తం నాలుగు వేదికల్లో సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు టీవీ నటులతో స్కిట్‌లు, బుర్రకథలు, బళ్లవేషాల ప్రదర్శనలు ఏర్పాటు చేస్తున్నట్లు ఉత్సవ కమిటీ ప్రతినిధులు తెలిపారు. బుధవారం రాత్రి తొలేళ్ల సంబరం ఘనంగా నిర్వహించారు. పురవీధుల్లో అమ్మవారి ఘటాల ఊరేగింపు సంప్రదాయబద్ధంగా జరిగింది.

హైమాస్ట్ లైట్ల ప్రారంభం



హైమాస్ట్ లైట్లు ప్రారంభిస్తున్న శానాపతి వసంత

పెందుర్తి: జీవీఎంసీ 97వ వార్డు పరిధిలోని ద్రోణంరాజునగర్, సింహాద్రినగర్ కాలనీ, కుమ్మరి కాలనీల్లో నూతనంగా ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను కార్పొరేటర్ శానాపతి వసంత బుధవారం ప్రారంభించారు. నాయకులు శానాపతి శంకర్రావు, అవగడ్డ అప్పలనాయుడు, సేనాపతి కృష్ణమూర్తి, కాలనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

రేకుల షెడ్‌ను ఢీకొన్న కారు

పరవాడ: మండలంలోని నాయుడుపాలెం–ముత్యాలమ్మపాలెం రహదారి సిమ్మన్నగారి గ్రామం సమీపంలో బుధవారం తెల్లవారు జామున ఓ కారు ఢీకొనడంతో నిరుపేద మహిళకు చెందిన రేకుల షెడ్ స్వల్పంగా దెబ్బతింది. పరవాడ నుంచి ముత్యాలమ్మపాలెం వైపు వస్తున్న కారు తెల్లవారు జాము 3 గంటల ప్రాంతంలో వేగంగా వస్తూ, మలుపులో అదుపుతప్పి చెట్లను ఢీకొని ఎదురుగా ఉన్న చినతల్లి రేకుల షెడ్‌ను బలంగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో రేకుల షెడ్డు, కారు ముందు భాగం స్వల్పంగా దెబ్బతిన్నాయి. ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు. దెబ్బతిన్న రేకుల షెడ్డుకు కారు యజమాని కొంత నష్టపరిహారం చెల్లించి కారును అక్కడి నుంచి తరలించారు.

శంకర్ ఫౌండేషన్‌కు అత్యాధునిక మైక్రోస్కోప్



మైక్రోస్కోప్‌ను ప్రారంభిస్తున్న నవీన్ మఖీర్జూ

సింహాచలం: శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రికి సౌత్ ఆసియా ఎల్‌పీజీ కంపెనీ అత్యాధునిక మైక్రోస్కోప్‌ను అందించింది. గడప గడపకు ఉచిత కంటి పరీక్ష ప్రాజెక్ట్ క్రింద రూ.60 లక్షల విరాళాన్ని ప్రకటించింది. ఈ మేరకు ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన మైక్రోస్కోప్‌ను ఎల్‌పీజీ కంపెనీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ నవీన్ మఖీర్జూ బుధవారం ప్రారంభించారు. కంటి వ్యాధి నిర్మూలనలో శంకర్ ఫౌండేషన్ అందిస్తున్న సేవలను కొనియాడారు. ఆస్పత్రి మేనేజింగ్ ట్రస్టీ ఆత్మకూరి కృష్ణకుమార్ సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు. సౌత్ ఆసియా ఎల్‌పీజీ సీఎఫ్‌వో వికాస్ వర్మ, మేనేజర్ రాంనాథ్, శంకర్ ఫౌండేషన్ జనరల్ మేనేజర్ కె.రాధాకృష్ణన్, డిప్యూటీ మేనేజర్లు రమేష్ కుమార్, బంగార్రాజు, వేణుగోపాల్ పాల్గొన్నారు.

న్యాయం చేయాలని ఆర్డీవోకు వినతి



ఆర్డీవో శ్రీలేఖకు గోడు వెల్లబోసుకుంటున్న రైతులు

పెందుర్తి: రైల్వే వంతెన నిర్మాణంలో భాగంగా భూములను కోల్పోతున్న నేపథ్యంలో తగిన పరిహారం ఇచ్చి న్యాయం చేయాలని ఆర్డీవో శ్రీలేఖను పొర్లుపాలెం, చింతలగ్రహారం, చీమలాపల్లి ప్రాంత వాసులు కోరారు. బుధవారం ఈ ప్రాంతంలో పర్యటించిన ఆర్డీవోను కలిసిన వినతిపత్రం ఇచ్చారు. ముందుగా రెవెన్యూ, సింహాచలం దేవస్థానం, నీటి పారుదలశాఖ, రైల్వే అధికారులతో కలిసి ఆర్డీవో శ్రీలేఖ వంతెన స్థలాన్ని పరిశీలించారు.

పోరాట స్ఫూర్తితో పునరుత్తేజం

- రానున్న రోజుల్లో మరింత బలంగా ప్రజాపోరాటాలు
- కూటమి దగాకోరు పాలనను ప్రజాక్షేత్రంలో నిలదీస్తాం
- వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవంలో సమన్వయకర్త అదీప్‌రాజ్



సబ్బవరంలో కేక్ కట్ చేసి పార్టీ శ్రేణులకు తినిపిస్తున్న మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్



పెందుర్తిలో పార్టీ జెండా ఆవిష్కరిస్తున్న అదీప్‌రాజ్, చిత్రంలో శరగడం, జయరామ్



మహానేత డాక్టర్ వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న అదీప్‌రాజ్, నాయకులు



అడవివరంలో పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న కొలుసు ఈశ్వరరావు

పెందుర్తి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రజల కోసం పుట్టిన పార్టీ అని, రానున్న రోజుల్లో పునరుత్తేజంతో.. మరింత పోరాట స్ఫూర్తితో ముందుకు వెళతామని ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. వైఎస్సార్‌సీపీ 15వ ఆవిర్భావ దినోత్సవాన్ని బుధవారం నియోజకవర్గ కేంద్రం పెందుర్తి నాలుగు రోడ్ల కూడలి వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీ స్థాపించిన నుంచి అన్నివిధాలా అండగా ఉన్న కార్యకర్తలే పార్టీకి కొండంత బలమని ఉద్ఘాటించారు. సీఎంగా జగన్ ఆదర్శవంతమైన పాలన అందించారని కొనియాడారు. గత ఎన్నికల్లో కల్లబొల్లి మాటలు చెప్పి, అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వ నిరంకుశ పాలనపై 9 నెలల్లోనే ప్రజలు గుర్రుగా ఉన్నారన్నారు. కూటమి దగాకోరు పాలనను ప్రజాక్షేత్రంలో నిరంతరం నిలదీస్తూనే ఉంటామని స్పష్టం చేశారు. ముందుగా పార్టీ జెండాను ఆవిష్కరించారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డికి ఘన నివాళి అర్పించారు. కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు. మిఠాయిలు పంచారు. పార్టీ సీనియర్ నాయకులు శరగడం చినఅప్పలనాయుడు, బయిలపూడి భగవాన్ జయరామ్, కోడిగుడ్ల దేవిసాంబ, ఉప్పిలి కనకరాజు, మెంటి మహేష్, గొరపల్లి శ్రీను, గండ్రెడ్డి మహాలక్ష్మినాయుడు, రాపర్తి మాధవరావు, తమరాన నర్సింగ్, బల్ల రాంబాబు, సూరిశెట్టి సూరిబాబు, గొంప అప్పారావు, అవగడ్డ వాసు, రొంగలి శంకర్, చిరికి దేముడు, అవగడ్డ సూర్యనారాయణ, రఘు, కోన శ్రీనివాస్, కార్యకర్తలు పాల్గొన్నారు.

సింహాచలం: వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని 98వ వార్డు అడవివరంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. పార్టీ జెండాను వార్డు అధ్యక్షుడు కొలుసు ఈశ్వరరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలో మళ్లీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడటం ఖాయమన్నారు. కార్యక్రమంలో అడవివరం కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ అధ్యక్షుడు కర్రి అప్పలస్వామి, వార్డు మాజీ అధ్యక్షుడు పీతల అప్పలరాజు, పార్టీ నాయకులు బోర కృష్ణారెడ్డి, మజ్జి ధర్మ, బోర ప్రసాద్‌రెడ్డి, తెడ్లపు మహేష్, కిషోర్‌రెడ్డి, ఆకుల నాగరాజు, దమ్ము ఎర్రాజీరావు, మజ్జి అప్పలరమణ, నారు వెంకటరమణ, మొయ్యి వెంకటరమణ, ఎన్ని ఈశ్వరరావు, అక్కిరెడ్డి అప్పలరాజు, అశోక్ పాల్గొన్నారు.

సబ్బవరం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాజకీయ లబ్ధికోసం ఏర్పాటు చేసిన పార్టీ కాదని, దివంగత మహానేత వైఎస్సార్ ఆశయ సాధనకోసం ఏర్పాటు చేసిన పార్టీ అని మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. మండల కేంద్రం సబ్బవరం మూడు రోడ్ల కూడలిలో నిర్వహించిన పార్టీ ఆవిర్భావ దినోత్సవంలో ఆయన పాల్గొన్నారు. పార్టీ శ్రేణులతో కలిసి పార్టీ జెండాను ఆవిష్కరించి, కేక్ కట్ చేసి పంచిపెట్టారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డే తన హయాంలో ప్రజలకు ఏ ప్రభుత్వమూ చేయనంత సంక్షేమం, అభివృద్ధి చేశారన్నారు. మోసపూరిత హామీలు, కుట్రలతో అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వంపై ప్రజల తిరుగుబాటు ఇప్పటికే మొదలయిందన్నారు. ప్రజల పక్షాన వైఎస్సార్‌సీపీ ఎల్లప్పుడూ పోరాడుతుందన్నారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు గండి రవికుమార్, రగడం చినప్పలనాయుడు, బయిలపూడి భగవాన్ జయరాం, పార్టీ మండల కన్వీనర్ కర్రి బాబు, బోకం రామునాయుడు, సబ్బవరం సర్పంచ్ దెడ్డం ప్రసాదరావు, మాజీ ఎంపీపీ సబ్బవరపు ముత్యాలనాయుడు, పాలిశెట్టి సురేష్‌రాజ్, వడ్డాది అప్పలరాజు, వనం అచ్చెంనాయుడు, మోపాడ అప్పారావు, దెడ్డం పద్మావతి, కాపుశెట్టి శేషుబాబు, యడ్ల నాయుడు, ఐడి బాబు పాల్గొన్నారు.

వృద్ధురాలికి ఆశ్రయం



లయోలా వృద్ధాశ్రమానికి వృద్ధురాలిని అప్పగిస్తున్న పోలీసులు

పెందుర్తి: నిరాదరణకు గురైన ఓ వృద్ధురాలికి పోలీసులు లయోలా వృద్ధాశ్రమంలో ఆశ్రయం కల్పించారు. వివరాలివి.. వేపగుంట సమీపంలోని సింహపురికాలనీలో ఉంటున్న అక్కినేని వరలక్ష్మి(65) తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ కుటుంబ నిరాదరణకు గురైంది. విషయాన్ని స్థానిక మహిళా పోలీస్ ద్వారా తెలుసుకున్న పెందుర్తి సీఐ కె.వి.సతీష్‌కుమార్ వరలక్ష్మికి ఆశ్రయం కల్పించేందుకు చొరవ తీసుకున్నారు. స్థానిక లయోలా వృద్ధాశ్రమం వ్యవస్థాపకుడు దొడ్డి ప్రకాష్‌తో మాట్లాడి ఆమెను అక్కడ చేర్పించారు.

క్రీడల్లో విద్యార్థుల్ని ప్రోత్సహించాలి

పరవాడ: విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహించడంలో పాఠశాలల యాజమాన్యాలు కీలకపాత్ర పోషించాలని సింహాద్రి ఎన్టీపీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సమీర్ శర్మ అన్నారు. సంస్థ సీఎస్సార్ విభాగం ఆధ్వర్యంలో లంకెలపాలెం జెడ్పీ హైస్కూల్లో ఏర్పాటు చేసిన గ్రామీణ క్రీడా పోటీలు బుధవారం ముగిశాయి. కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఫిట్‌నెస్, విద్యా నైపుణ్యంలో క్రీడల పాత్రను వివరించారు. ఇక్కడ నిర్వహించిన ఖోఖో, వాలీబాల్, త్రోబాల్, కబడ్డీ, అథ్లెటిక్స్ పోటీల్లో పరవాడ, ఇస్లాంపేట ప్రాంతాల్లోని 14 ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 500 మంది విద్యార్థులు పాల్గొన్నారు. పీఈటీలు, అంపైర్లకు ట్రాక్ షూట్లు, క్యాప్‌లు, షూ, స్పోర్ట్స్ కిట్లు, విజేతలకు బహుమతులను ఈడీ సమీర్‌శర్మ అందించారు. కార్యక్రమంలో ఏజీఎం హెచ్‌ఆర్ బి.బి.పాత్ర, సీఎస్సార్ హెచ్‌ఆర్ మేనేజర్ కె.ప్రకాశరావు పాల్గొన్నారు.

స్కూల్ డ్రాపౌట్లు తగ్గించేందుకు కృషి

సబ్బవరం: ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల డ్రాపౌట్ల శాతాన్ని తగ్గించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని సమగ్ర శిక్ష అనకాపల్లి జిల్లా అసిస్టెంట్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ ఆర్.జయప్రకాష్ కోరారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించిన క్లస్టర్ స్కూల్ కాంప్లెక్స్‌లో ఆయన పాల్గొని, మాట్లాడారు. ఎస్‌సీఈఆర్టీ నిబంధనల మేరకు క్లస్టర్ సమావేశాలను నిర్వహించాలన్నారు. జెడ్పీ హైస్కూల్‌ను సందర్శించారు. ఆయన వెంట ఎంఈవోలు లక్ష్మణరావు, రవీంద్రబాబు, ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం తిరుపతిరావు, సీఆర్పీలు, సబ్జెక్టు టీచర్లు పాల్గొన్నారు.

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 51 మంది ఎంపిక



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో నియామక సిబ్బంది

పెందుర్తి: స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో బుధవారం నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 51 మంది ఎంపికయ్యారు. హైదరాబాద్‌కు చెందిన మేధా సర్వో డ్రైవ్స్ సంస్థలో ఉద్యోగాల నిమిత్తం జరిగిన టెస్ట్‌కు ఉమ్మడి విశాఖ జిల్లాలోని 18 ప్రభుత్వ, ప్రవేటు కళాశాలలకు చెందిన 401 మంది విద్యార్థులు హాజరు కాగా అందులో 169 మంది క్యాంపస్ ఇంటర్వ్యూలకు ఎంపికైన సంగతి తెలిసిందే. వీరికి బుధవారం ఇంటర్వ్యూలు నిర్వహించగా అందులో 51 మంది సదరు కంపెనీలో ఉద్యోగాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.చంద్రశేఖర్ తెలిపారు. ఒక్కొక్కరికి ఏడాదికి రూ.2.9 లక్షల ప్యాకేజీ లభిస్తుందన్నారు.